**సృష్టిలో చిత్రా లనేకం అంటారు. అవును మరి, మా ఊరికి, ఆ మాట కొస్తే మా ప్రాంతానికి గాయత్రి జీవితం ఓ విచిత్రమే. ఇప్పటికీ గాయత్రిని తలుచుకుంటే గుళ్లో హారతి కళ్ల కద్దుకున్నట్లుంది.**

ఆ రోజు మా ఊరికి కూత వేటు దూరంలో ఉన్న బలి ఘట్టంలో ప్రతి ఏటా శివ రాత్రికి జరిగే తీర్థాల ఆఖరి రోజు. తీర్థంలో జనం పలచబడి పోయారు. అప్పటికే చాలా దుకాణాలు ఎత్తేశారు. ఉన్న ఒకటీ అరా దుకాణాలు వాళ్లు కూడా ఆ మర్నాటి నుంచి ప్రారంభమయ్యే ఉప్మాక తీర్థాలకి బళ్లు కట్టేస్తున్నారు. ఆ వేళప్పుడు గుడి కట్టేసి పూజారి బ్రహ్మయ్య శాస్త్రి గారితో కబుర్లాడుతూ వస్తున్న మాధవయ్య, గుడి మెట్ల మీద కూర్చుని పక్కనే పారుతున్న ఏటి గలగలలు మైమరచి వింటున్న మూడేళ్ల పాపను చూసి ఆశ్చర్య పోయాడు. దగ్గరకు వెళ్లి చూస్తే మా ఊరి పిల్ల కాదు. ఎవరి పాపో తప్పి పోయిందని, ఆ పాపని చంక నేసుకుని ఎవరి పాప అంటూ మాధవయ్య తీర్థ మంతా తిరిగాడు.


ఆ పాప గురించి మునసబు గారు చుట్టు పక్కల ఊళ్లలో పది రోజుల పాటు దండోరా వేయించారు. కాని ఫలితం లేక పోయింది. "ఎవరి పాపవమ్మా?" అంటే, చిరు గాలికి పున్నాగ పూలు జలజలమని రాలినట్టు తీయగా నవ్వేసింది అంతే. నుదుటి మీదకు అందంగా వేలాడే ముంగురులు, నొత్తయిన పొడుగాటి ఉంగరాల జుత్తు, బుట్ట చేతుల పట్టు జాకెట్టు, వెడల్పంచు కంచి పట్టు పరికిణీలో, చిదిమిన పాల్గారే చెక్కుటద్దాలు, ఎడమ బుగ్గపై పెసర గింజంత పుట్టు మచ్చ, నుదుట ఎర్రగా మెరిసే దోస గింజ బొట్టు, మెడలో చిన్న రుద్రాక్షలు కూర్చిన బంగరు గొలుసు, చెంపకు చారెడు కళ్లతో వేద రాశిలా వెలిగి పోయే ఆ చిన్నారిని ఏ సవితి తల్లో కావాలనే తీర్థంలో వదిలేసి ఉంటుందని అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకున్నారు. ఆ పాప మాధవయ్య దగ్గరకు తప్ప ఎవరి వద్దకు పిలిచినా వెళ్లింది కాదు.

మాధవయ్య సత్తె కాలపు మనిషి. ఒక్కగా నొక్క కొడుకైన మాధవయ్యను చిన్నతనంలోనే కాంచీ పురం విద్యాభ్యాసానికి పంపారు. తండ్రి గారి అకాల మరణంతో చదువాపి వచ్చేశాడు. అక్కడ వేదశాస్త్రాధ్యయనం గణనీయంగానే చేసినా, అంత కంటే ఎక్కువగా అపార సంగీత జ్ఞానం, ఆధ్యాత్మిక చింతన ఒంట పట్టించు కున్నాడు. బతికున్నన్నాళ్లు తల్లి, ఆ పైన అయిన వాళ్లు ఎంత చెప్పినా వివాహం మాట తల పెట్టక, దైవ చింతనలో సంకీర్తన గానంతో కాలం వెళ్లబుచ్చే వాడు. పిత్రార్జితమైన పదెకరాల మాగాణి కౌలు కిచ్చి, తన అనంతరం బ్రహ్మలింగేశ్వరునికి కైంకర్యం అయ్యేట్లుగా రాసేశాడు.

అదిగో అలాంటి మాధవయ్యకు చేరువైం దా పాప. తను నిరంతరం జపించే గాయత్రి ఈ రూపాన తనకు సాక్షాత్కరించిందని మాధవయ్య పాపను "తల్లీ, గాయత్రీ!" అని పిలిచే వాడు. పాప మాత్రం మాధవయ్యను "పెచ్చి కన్నా" అని పిలిచేది. ఎప్పుడూ పట్టు బట్టల్లో మెరిసిపోతూ అలా చిదిమి దీపం పెట్టొచ్చనే చక్కదనం గల ఆ చిన్నారిని వెంట బెట్టుకుని, తంబురా మీటుకుంటూ మాధవయ్య సంకీర్తన చేస్తూ వస్తుంటే చూడ ముచ్చటగా ఉండేది.


మాధవయ్యకే కాదు, మా మునసబు గారికి కూడా గాయత్రి మాట వేద వాక్కే. "సాధ్యాసాధ్యాలు ఆలోచించే పని లేదు. చిట్టి తల్లి ఏం చెబితే అది చెయ్యాల్సిందే" అనే వారు.

పాప రూపులోను, చూపులోనే కాదు, ఆ గొంతులో కూడా ఏదో అనిర్వచనీయమైన మాధుర్యం తొణికిసలాడేది. ఆ చిన్నారి చిరునవ్వు కూడా ఓ మౌన గీతంలా ఉండేదంటే నమ్మండి. తోటి పిల్లలతో కంటే పశు పక్ష్యాదులతోనో,



తువ్వాయితోనో, బుజ్జి మేకతోనో ఆడుకునేది. అవి అరిస్తే, విన్న వాళ్లు "ఔరా!" అని ఆశ్చర్యపోయేలా వాటి అరుపులను తన గొంతులో ప్రతిధ్వనించి కిల కిల మనేది.

వాటితో ఆమె అనుబంధం ఎంతటి దంటే, ఓ రోజు సాయం వేళ వీధి వాకిట్లో తొక్కుడు బిళ్ల ఆడుకుంటూ కల స్వనం చేస్తే "ఈ క్రౌంచ కూజితం ఎప్పుడు నేర్చావే చిట్టి తల్లీ?" అంటూ ప్రసాదం చేతి కిచ్చి మాధవయ్య ఏదో అనబోతుంటే, కోయిలలా కూసి, గుర్రంలా సకిలించి



కిలకిలమంది. ఇంతలో వీధిలో కలకలం చెల రేగింది. దేవాలయం ఏనుగు మావటి వాడికి జ్వరం వస్తే కొత్త మావటి ఎక్కాడట. దానికి తిక్క రేగి బజారంతా చిందర వందరచేసి నాలుగు వీధుల కూడలిలో రెండు కాళ్లు పైకెత్తి భీకరంగా ఘీంకరించింది. గాయత్రి ఒక్క గెంతుతో వీధిలోకి వచ్చి తను కూడా కుడి కాలు పైకెత్తి, ఎడమ చేతి ముని వేళ్లతో కుడి చెయ్యి తొండంలా పైకెత్తి ఏనుగును వెక్కిరిస్తున్నట్లు ఘీంకరించింది.

ఎనిమిదేళ్ల పిల్ల ఏమైపోతుందో అని అందరూ హడలి పోయారు. అదేం విచిత్రమో, ఏనుగు మెళ్లో గంట మ్రోగించుకుంటూ వచ్చి గాయత్రి చేతిలో అరటి పండు అందుకుని తొండం పైకెత్తి, చిన్నగా ఘీంకరించి వెళ్లిపోయింది. "తల్లీ! నీ కేమైనా అయితే నేనేమై పోతాను? అలాంటి పను లెప్పుడూ చెయ్యకమ్మా" అంటూ మాధవయ్య గాయత్రిని అక్కున చేర్చుకున్నాడు.

"పిచ్చి కన్నా, ఏం పర్వా లేదు. అయినా రోజూ నేను ప్రసాదం పెట్టే ఏనుగే కదా, నన్నేం చేస్తుంది?" అని కిల కిల నవ్వింది.

బడి వెళ్లి పెద్దగా చదివేది కాదు కాని, గుడిలో మంత్ర పఠనం, వేద శాలలో వేద పఠనం వింటూ తన్మయత్వం చెందేది. సామ గానం అయితే మరి చెప్పక్కర్లేదు. "ఏటికి నే బిడ్డను తోటకు తోబుట్టువును" అనిపించేలా ఏటి వొడ్డున గలగలలు వింటూ, తోటలో పిల్లలతో ఆడుకుంటూ తను కూర్చుకున్నదో, మరెక్కడ విన్నదో తెలియదు గాని సంకీర్తనతో గొప్పగా గానం చేసేది. పున్నమి నాడైతే మరీను. పెరట్లో తులసి కోట ముందు కృష్ణాజినం వేసుకుని వెన్నెల్లో కూర్చొని మహాద్భుతంగా పాడేది. అదేం అంటే, "షోడశ కళల చంద్రుడు గదా, పదహారు నిండితే పరిపూర్ణత వస్తుంది కదా!" అనేది.

"అమ్మా, నీ నాద మాధుర్యం వింటూంటే కుండలిని మేల్కొంటుంది తల్లీ! వయసు మళ్లిన నా వొంటరి బ్రతుకులో వెలుగులా వచ్చావు. నిన్నో అయ్య చేతిలో పెట్టేస్తే నా బాధ్యత తీరుతుంది. కాని నువ్వెక్కడున్నా నీ గానం వింటూనే నే తనువు చాలించాలి తల్లీ" అనే వాడు మాధవయ్య.

"పిచ్చి కన్నా! చెప్పానుగా నాతో పాటే నువ్వు, నీతో పాటే నేను' ' అనేది.

ఆమె గొంతులో ఇదీ అని చెప్ప లేని లాలిత్యం, గానంలో అనిర్వచనీయమైన మాధుర్యం విని తరించ వలసిందే గాని చెబితే నమ్మే విషయం కాదు. మాధవయ్యతో పాటు ప్రతి రోజూ

వెల్చేటి సుబ్రహ్మణ్యం

# ఊహాతీతం

కోవెలలో కనసభాత గానం, రాత్రి మంగళ గానం విధిగా చేసేది. వానొచ్చినా, వర దొచ్చినా, ఏమైనా సరే, మానేది కాదు. "పోనీ ఈ రోజుకి ఉండి పో తల్లీ!' ' అంటే, "దేవునికి బాకీ పడి పోతాం, ఋణం పెరిగి పోతుంది" అనేది. మాధుర్యానికి మారు పేరైన ఆమె గొంతులో రౌద్రం అంటే ఏమిటో ఒక్క సారి మాత్రం వినటం జరిగింది.

ఒక సారి ఏమైం దంటే, మా ప్రాంతంలో సర్వ సిద్ధి అగ్రహారీకులు, రస హృదయులు, కళా పోషకులైన వద్దిపర్తి వీరరాఘవస్వామి గారు గాయత్రిని తమ దేవిడీలో గానం చెయ్యి వలసిందిగా ఆహ్వానిస్తూ, వారి దివానుతో కానుకలు పంపారు. విషయం తెలిసిన గాయత్రి చటాలున లేచి, తంబురా పట్టుకుని పెరట్లోకి వెళ్లి, తులసి కోటకు ప్రణ మిల్లి రుద్ర గానం చేసింది. అమ్మో! ఆ రౌద్రం తలచుకుంటే ఇప్పటికీ వెన్నులో వణుకు పుడుతుందంటే నమ్మండి

బ్రహ్మలింగేశ్వరుని సన్నిధిలో తప్ప ఎవ్వ రింట్లో గాయత్రి గానం చేయదని, మునసబు గారు స్వయంగా వెళ్లి జమిందారు గారికి విన్నవించారు. రస హృదయులైన ఆయన ఆలయంలో గాయత్రి గానం ప్రచ్ఛన్నంగా విని, "అమ్మా! ఆ సంగీత సరస్వతికే ఆధాకమైన సాక్షాత్తు రాజరాజేశ్వరీ రూపిణివైన నీకు కానుక లంపిన నా అజ్ఞానాన్ని మన్నించు తల్లీ!" అంటూ అంజలి ఘటించారు. అప్పటి నుండి వారికి వీలై నపుడల్లా ఆలయానికి వచ్చి, గాయత్రి గానం విని పరవశించి పోయే వారు. ఆమె కూడా ఆయనతో ఆప్యాయంగా మెలిగేది.

ఆ రోజు మహా శివ రాత్రి. అంతకు వారం రోజుల ముందు నుండి అదేం మాయదారి తుఫానో గాని, ఒకటే కుండ పోతగా వర్షం. ప్రదోష వేళ కాసింత వాన తెరి పిచ్చిన ట్టనిపించింది. మళ్లీ ముంచు కొస్తే ఏరు దాటడం కష్టమని శివాలయానికి చాలా మంది అప్పుడే బయలుదేరారు. అలా బయలుదేరిన మునసబు గారు, 'మాధవయ్యా, మధ్యాహ్నం మా మనవడు గుండెల మీద ఆడుతూ జంధ్యంలో ఓ పోగు ఛిన్నం చేశాడోయ్, నీ దగ్గరో కొత్త జంధ్యం ఉంటే ఇయ్యి' అంటూ లోపలికి వచ్చారు.

మాధవయ్య కూడా అప్పుడే ఆలయానికి వెళ్లడానికి ఆయత్తమవుతున్నాడు. గాయత్రి మాత్రం కృష్ణాజినం పై పద్మాసనం వేసుకుని తాదాత్మ్యంతో తంబూరా మీటుకుంటూ మౌన ముద్రలో ఉంది. మాధవయ్య షోడశ కళలు నిండిన చందమామలా గాయత్రి ఎలా వెలిగి పోతూందో చూడు. చిట్టి తల్లికి అప్పుడే పదహా రేళ్లొచ్చా యంటే నమ్మ బుద్ధి కావటం లేదు. నిన్న గాక మొన్న మన మధ్యకు వచ్చి నట్టుంది" అన్నారు.

"నాకు మాత్రం నా చిట్టి తల్లితో ఎన్ని జన్మల నుండో కలిసి ఉన్నాను అనిపిస్తుంది" అంటూ జంధ్యం అందించాడు మాధవయ్య. "అమ్మా బయల్దేరదామా?" అన్నారు మునసబు గారు.

"తొలి జాము లోపునే అందరినీ దేవళానికి వచ్చేయమని చెప్పండి" అంది గాయత్రి.

ఎందుకో అర్థం కాలేదు. కాని "అలాగే నమ్మా" అన్నారు.

బారికి గంగులు డప్పందుకుని ఆ విషయం అర ఘడియలో దండోరా వేశాడు. మా వూరు చిన్నదైనా కట్టుబాటుకి పెద్దది కదా, రాత్రి ఏడు గంటల వేళకి పిల్లా మేకతో అందరూ శివాలయానికి చేరుకున్నారు. బేడా మండపం, ప్రధాన మండపం అంతా జనంతో కిట కిటలాడాయి. గర్భ గుడి నమక చమకాలతో ప్రతిధ్వనిస్తోంది.

గాయత్రి మారేడు చెట్టు పక్కన గల ఈశాన్య మండపంలో పద్మాసనం వేసి గానం ప్రారంభించింది. అది రాగం కాదు. అది గానం కాదు. ఇది అని చెప్ప లేని నాదోపాసన అది. ఏ స్థాయిలో ప్రారంభించి, ఏ స్థాయి వరకు పైకి వెళ్లిందో చెప్పలేం కాని, కర్మేంద్రియం విన గల్గితే అనుమంద్ర షడ్జమం మొదలు అతి తార స్థాయి పంచమం వరకు సంచారం చేస్తూ శ్రీ, వసంత, భైరవి, పంచమ, మేఘ రాగాల రాగ మాలిక ఆమె ఆలపిస్తుంటే, సద్యోజాత, వామ దేవ, అఘోర, తత్పురుష, ఈశానాది పంచముఖ విలసితుడై సాక్షాత్పరమ శివుడే గానం చేస్తున్నాడా అనిపించింది.

లింగోద్భవ వేళ సమీపిస్తున్న కొద్దీ గానం మరింత అనిర్వచనీయ స్థాయికి చేరుకుంటోంది. మాధవయ్య అన్నట్లు ఆ నాద మాధుర్యానికి కుండలిని మేల్కొని, షట్చక్రాలను అధిగమించి, సహస్రారాన్ని చుంబిస్తోందా అనిపించింది. బయట వర్షం, హోరు గాలి కూడా అంతకు రెట్టింపు తీవ్రంగా ముంచెత్తాయి. ఒకటే గాఢాంధకారం. ఈ రాత్రి తెల్లారితే బాగుణ్ను అనిపించింది.

తెల్లవారి చూస్తే ఇం కేముంది? ఒరిగి పోయిన మారేడు చెట్టు కింద మాధవయ్య అచేతనంగా పడి ఉన్నాడు. గుడి బయటకు వచ్చి చూస్తే గుండె గుభేలుమంది. మా ఊరికి ఉత్తరంగా పారే ఏరు, దారి మారి తూర్పు దిశగా తిరిగి మా ఊరి మీద నుండి పారుతోంది. అంతా ఒకటే జలమయం! మా ఊరూ కనపడ లేదు, గాయత్రీ కనబడ లేదు!

